క్లుప్తంగా

నూతన పనులను గుర్తించాలి

డ్వామా పీడీ సర్వే పరిశీలనలో వెల్లడి

బొల్లాపల్లి: ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్న సర్వేను పల్నాడు జిల్లా డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. మండల కేంద్రమైన ఎస్సీ కాలనీ, లక్ష్మీపురం తండాల్లో ఏపీవో ఎస్. ఆంజనేయరాజు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది సర్వే నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీల్లో జాబ్‌కార్డుల సంఖ్య, పనులు చేపట్టడం వంటి వివరాలపై సర్వే నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కూలీల జాబ్‌కార్డులకు ఆధార్ లింక్ నమోదు తప్పనిసరి అన్నారు. గ్రామాల్లో నూతనంగా పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపాలని, కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాతులూరులో ఆరంభమైన వార్షికోత్సవాలు



నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవతల ఆలయ తొమ్మిదో వార్షికోత్సవ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. పోలేరమ్మ, మునిబందమ్మ, వినుకొండ అంకమ్మ ఊర అంకమ్మ, మహాలక్ష్మమ్మ, నాభిశిలలకు తొలిరోజు భక్తులు సాంప్రదాయబద్ధ మేళతాళాలతో పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఉదయాన్నే ఘటం కుండ ఊరేగింపు నిర్వహించారు. 5వ తేదీన వసంతోత్సవం, ఆరో తేదీన పొంగళ్లు పొంగించి నైవేద్య సమర్పణ, అదేరోజు భారీ అన్నదాన కార్యక్రమం, ఏడున మొక్కుబడులు, 8న సిడిమానోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 9 గంటలకు ఆలయం వద్ద భజనా కార్యక్రమాలు జరగనున్నాయి.

నేడు పింఛన్ల పంపిణీ

శావల్యాపురం: నేడు అన్నీ గ్రామాల్లో వైఎస్సార్ సామాజిక పింఛన్లను వలంటీర్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలో 5745 మంది పింఛనుదారులు ఉండగా రూ.ఒక కోటి 49 లక్షల 60 వేల ప్రభుత్వం ప్రతినెలా మంజూరు చేస్తుందన్నారు. ఆయనతో పాటు పరిపాలన అధికారి వాణి, సిబ్బంది కారుచోలు భారతి, నలబోతుల వరలక్ష్మి ఉన్నారు.

నాదెండ్ల: మండలంలోని సచివాలయాల పరిధిలో బుధవారం ఉదయం వైఎస్సార్ పెన్షన్‌కానుక-సామాజిక భద్రతా పెన్షన్లు పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ తెలిపారు. మండల పరిధిలో 9383 మంది లబ్ధిదారులకు గాను రూ.2,58,58,500లు నగదు తెల్లవారుజాము నుంచే వలంటీర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

వ్యక్తిపై హత్యాయత్నం

ఈపూరు: మండలంలోని ఊడిజర్ల గ్రామంలో సోమవారం రాత్రి ఒక వ్యక్తిపై హత్యాయత్నం జరిగినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు. వివరాల మేరకు చాగంరెడ్డి రత్నారెడ్డి ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఒక వ్యక్తి వచ్చి ఇంటి తలుపు తట్టడంతో తలుపు తీయగానే రత్నారెడ్డిపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిని రత్నారెడ్డి ప్రతిఘటించడంతో ఆగంతకుడు బలంగా కత్తితో పొడిచేందుకు ప్రయత్నించగా స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రత్నారెడ్డిని ఈపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మంగళవారం వినుకొండ రూరల్ సీఐ రమేష్‌బాబు క్షతగాత్రుడిని పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకున్నారు. అయితే వచ్చిన వ్యక్తి మూతికి మాస్క్ ధరించి ఉన్నాడని, అతనితో పాటు మరొక వ్యక్తి కలిసి వచ్చాడని, అయితే వారు తమ బంధువులకు సంబంధించి వారిగా అనుమానిస్తున్నట్లు రత్నారెడ్డి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

మిరపకాయల కళ్లంలో చోరీ

ఈపూరు: పొలంలో ఆరబోసిన మిరపకాయలు చోరీకి గురైన సంఘటన మండల కేంద్రమైన ఈపూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గంజనబోయిన చిన్నా తన పొలంలో మిరపకాయలు ఆరబోసి ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి రెండు క్వింటాళ్ల మిరపకాయలను దొంగిలించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

భారతంలో ఉత్తర కుమారుడు లోకేష్


- ప్రజలపై రుద్దాలని చూస్తున్న చంద్రబాబు
- నాలుగోరోజు వెంగళరెడ్డినగర్ గడపగడపలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: 'టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పచ్చి అబద్ధాల కోరు.. భారతంలో ఉత్తర కుమారుడిని పోలిన విధంగా ఆయన మాటలు, వ్యవహార శైలి ఉంది' అంటూ పేర్కొన్నారు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాలుగోరోజు ఎనిమిదవ వార్డు వెంగళరెడ్డినగర్‌లో పర్యటించారు. పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేకు వార్డు నాయకులు మాజీ కౌన్సిలర్ అబ్దుల్ సత్తార్, సయ్యద్ ఫాతిమూన్, సయ్యద్ పెద్దఖాజా, షేక్ కరిముల్లా, షేక్ ఖాజా, షేక్ మహబూబు సుభాని ఆధ్వర్యంలో మైనార్టీ సోదరులు ఘన స్వాగతం పలికారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఇప్పటి వరకు ప్రతి గృహానికి అందుతున్న సంక్షేమ పథకాలను గురించి తెలియచేస్తూ వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. వారు చెబుతున్న సమస్యలను వింటూ వారి మనోభావాలను తెలుసుకున్నారు. ఒక వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు.

అవాస్తవాలు వల్లెవేస్తున్నారు!

విలేకర్లతో ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ లోకేష్ చేస్తున్న పాదయాత్రలో చిత్తూరు జిల్లాలో మహానేత డాక్టర్ వైఎస్సార్ తీసుకొచ్చిన పారిశ్రామికవాడ శ్రీసిటీని తామే తీసుకొచ్చామని, కంపెనీలను తీసుకొచ్చి ఉద్యోగాలు కల్పించామని పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడన్నారు. చంద్రబాబు హయాంలో నాలుగు లక్షలు ఉద్యోగాలిచ్చామని చెబుతున్నాడన్నారు. ఈ ప్రాంతంలోని పంచాయతీ పరిధిలో గల ప్రాంతాన్ని మొత్తాన్ని పురపాలక పరిధిలోకి తీసుకొచ్చి రూ.1.60 కోట్ల వ్యయంతో సీసీరోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. పట్టణపేదరిక నిర్మూలన పథకం కింద ప్రతిఒక్కరికీ తాగునీటి వసతి కల్పించామన్నారు.

ఆయనవెంట షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజావలి, మాజీ కౌన్సిలర్లు మాగులూరి రమణారెడ్డి, మాడిశెట్టి మోహనరావు, గేరా ధర్మారావు, టౌన్ కన్వీనర్ల ఇన్‌చార్జిలు మద్దిరెడ్డి నరసింహా రెడ్డి, ఎస్‌కే ఆంజనేయులు, కాకుమాను మంగపతిరెడ్డి, బొగ్గరం మూర్తి, బీసీ వెంకట్, ముద్దాకరిముల్లా, షేక్ దాదా, సయ్యద్‌ఖాదర్‌బాషా, షేక్ బాజి, ఆర్టీసీ పెద్దిరెడ్డి, మల్లెల అనీల, సీహెచ్. అనూరాధ, ద్వారక, పెనుబాక లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల వివరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

టీడీపీ నాయకులకు నిద్రపట్టడం లేదు

ముఖ్యమంత్రి సభ విజయవంతంపై ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వినుకొండలో జగనన్న చేదోడు పథకం సభను విజయంతం చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ధన్యవాదాలు తెలియజేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వినుకొండ నియోజకవర్గానికి ముస్లిం మైనార్టీ కళాశాలకు రూ.10 కోట్లు, 100 పడకల ఆసుపత్రికి రూ.15 కోట్లు, బొల్లాపల్లి మండలం ప్రజల దాహార్తి తీర్చేందుకు తాగునీటి పథకానికి రూ.12 కోట్లు మంజూరు చేయడం చారిత్రాత్మకమన్నారు.

ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే పేరు ఉండేలా అభివృద్ధి చేసి తీరుతామన్నారు. వెంటనే ఆసుపత్రి, మైనార్టీ కళాశాల, తాగునీటి పథకాల నిర్మాణాలను చేపడతామన్నారు. ముఖ్యమంత్రి సభ విజయవంతం కావడంతో ప్రతిపక్ష నాయకులకు నిద్రపట్టడం లేదని, ముఖ్యమంత్రి సభ సందర్భంగా చెట్లను తొలగించారని పసలేని విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. పర్యావరణానికి ముప్పు కలిగించే కార్బన్ కార్పస్ మొక్కలను రాష్ట్ర వ్యాప్తంగా తొలగిస్తున్నారని, అందులో భాగంగా వినుకొండలో మొక్కలను కూడా తొలగించడం జరిగిందన్నారు. గతంలో ఇదే ప్రతిపక్ష నాయకులు ఈ మొక్కలను తొలగించాలని పత్రికాముఖంగా ప్రభుత్వంపై విమర్శలు చేశారని, అయితే అదే చెట్లను తొలగిస్తుంటే పచ్చని చెట్లను తొలగించారని దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చెట్లను తొలగించిన స్థానంలో మొక్కలను నాటిన ప్రభుత్వంపై చేసిన విమర్శలను ఖండించారు. వినుకొండలో తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులను కోర్టులకు వెళ్లి అడ్డుకోవడం తప్ప మాజీ ఎమ్మెల్యే ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో వందల కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తుంటే మింగుడు పడని ప్రతిపక్ష నాయకులు అసత్యప్రచారాలు చేస్తున్నారన్నారు.

గతంలో ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు చెత్తపై పన్నులు విధిస్తేనే ప్రజలకు బాధ్యత ఉంటుందని, పర్యావరణ సంస్థలో సభ్యునిగా ఉండి పత్రికాముఖంగా ప్రకటనలు చేశారని, అదే చంద్రబాబు చెత్తపై పన్ను వేస్తున్నారని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి సభకు ఎన్నడూ లేనివిధంగా స్వచ్ఛందంగా ప్రజలు తరలిరావడం చూసి టీడీపీ నేతలకు మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. రానున్న రోజుల్లో వినుకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి ఆగదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

అసంబద్ధ ఆరోపణలు మానుకో!

- డాక్టర్ అరవిందబాబుకు ఎమ్మెల్యే గోపిరెడ్డి హెచ్చరిక
- వెంకటేశ్వరరావు ఆత్మహత్యకు కారణాలు ఆయన భార్య స్పష్టంచేసింది
- అమరా కళాశాల స్థలాన్ని బ్యాంకు ద్వారా కొన్నది టీడీపీ వ్యక్తులే

నరసరావుపేట: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు తన అసంబద్ధపు ఆరోపణలు మానుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. లేనిపక్షంలో ప్రజలలో చులకనై పోతావని హెచ్చరించారు. ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అమరా వెంకటేశ్వరరావు ఆత్మహత్య సంఘటనలో వైఎస్సార్‌సీపీ వారికి ఎటువంటి సంబంధం లేదని, ఉన్న వాస్తవం ఏమిటో ఆయన భార్య ఇప్పటికే ప్రకటించిందని పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ప్రకాష్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అమరా ఆత్మహత్యకు వైఎస్సార్‌సీపీ నాయకులే కారణమంటూ అరవిందబాబు చేసిన ఆరోపణలను ఖండించారు. అమరా వెంకటేశ్వరరావు వైఎస్సార్‌సీపీ అభిమానని అవసరమైతే ఆయనకు సహాయం చేసేవారమే గాని ఆయనకు హాని తలపెట్టబోమన్నారు. అమరాకు చెందిన కళాశాల స్థలాన్ని నరసరావుపేట టీడీపీ అసెంబ్లీ సీటుకోసం ప్రయత్నం చేస్తున్న తిరుమల కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ బ్యాంకు నిర్వహించిన వేలంపాటలో తమ కళాశాల తరపున కొనుగోలు చేశాడన్నారు. తాము అప్పులపాలై రూ.26 కోట్లు కెనరా బ్యాంకుకు చెల్లించినా బ్యాంకు అధికారులు స్థలాన్ని వేలం వేసి తమను అన్యాయం చేశారంటూ అమరా వెంకటేశ్వరరావు భార్య ప్రకటించిందన్నారు. స్థలాన్ని కొనుగోలుచేసిన తిరుమల కళాశాల పాలకవర్గంలోని ఒక్క వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు తప్పించి మిగతా వారైన దండా బ్రహ్మానందం, బత్తిని నాగేశ్వరరావు టీడీపీకి చెందిన వారు కాగా, డాక్టర్ నలబోతు వెంకటరావు బీజేపీకి చెందిన వ్యక్తి అన్నారు.



అమరా వెంకటేశ్వరరావు మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

వీధి బాలలకు చదువు చెప్పించాలి

సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ షేక్.మహబూబ్ జంగుసుభాని



వీధి బాలల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మేజిస్ట్రేట్ జంగుసుభాని

నరసరావుపేట ఈస్ట్: చిన్నారులను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించి వారికి చదువు చెప్పించాలని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ షేక్.మహబూబ్ జంగుసుభాని తెలిపారు. వీధి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినుకొండ రోడ్డులో వీధి బాలలు, వారి తల్లిదండ్రులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మేజిస్ట్రేట్ జంగుసుభాని ముఖ్యఅతిథిగా పాల్గొని విద్య ప్రాధాన్యతను వివరించారు. వలస కార్మికులు తమ పిల్లల చదువు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీవనోపాధి కోసం తల్లిదండ్రులు వలస కూలీలుగా మారితే వారి పిల్లలకు చదువు చెప్పేందుకు ప్రభుత్వ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో లిటిల్ హార్ట్స్ సంస్థ ప్రతినిధి జొన్నలగడ్డ నాగరాజేశ్వరి, కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, న్యాయవాదులు ఎం.చంద్రశేఖర్, టి.అమూల్య, టౌన్ క్యాటరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గట్టు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కారుమంచిలో బ్యాంకుశాఖ

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో నూతనంగా చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖను త్వరలో ప్రారంభిస్తున్నట్లు స్థానిక బ్యాంకు శాఖ బ్రాంచి ఇన్‌చార్జ్ మేనేజరు గుబ్బల సుధీర్ మంగళవారం తెలిపారు. గ్రామస్తులు సహాయ సహకారాలతో బ్యాంకు చైర్మన్, నరసరావుపేట రీజనల్ మేనేజరు, ప్రజాప్రతినిధుల సారథ్యంలో త్వరలో ప్రారంభించటానికి రంగం సిద్ధం చేశామన్నారు.

కుష్ఠువ్యాధి లక్షణాలు గుర్తించాలి



అవగాహన కార్యక్రమంలో వైద్య బృందం

నాదెండ్ల: కుష్ఠు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్ గోపీనాయక్ చెప్పారు. కుష్ఠువ్యాధి పక్షోత్సవాల్లో భాగంగా గణపవరంలోని ఐసీఎం కంపెనీలో కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చర్మంపై స్పర్శలేని మచ్చలు, మెరిసే జిడ్డుగల చర్మం, బత్తాయి తొక్కలా ఉన్న మచ్చలను కుష్ఠువ్యాధి ప్రారంభ దశగా గుర్తించాలన్నారు. అవగాహన కార్యక్రమంలో లెప్రసీ నోడల్ అధికారి షేక్ అజీజ్, డీపీఎంవో రమణారావు, ఆరోగ్య పర్యవేక్షకులు పద్మావతి, జానకీదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కుష్ఠు రహిత సమాజాన్ని సాధిద్దాం

నరసరావుపేట రూరల్: కుష్ఠు రహిత సమాజాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ చట్టు సత్యనారాయణ తెలిపారు. జాతీయ కుష్ఠు నివారణ కార్యక్రమంలో భాగంగా జనవరి 30వ తేదీ నుంచి ఈనెల 13వ తేదీ వరకు గ్రామాల్లో లెప్రసీ సర్వేను నిర్వహిస్తున్నారు. మండలంలోని రావిపాడులో నిర్వహిస్తున్న లెప్రసీ సర్వేను డీపీఎంఓ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. కుష్ఠు వ్యాధి మైకోబక్టీరియా లెప్రే సూక్ష్మక్రిమి వలన కుష్ఠు వ్యాధి వస్తుందని తెలిపారు. చర్మానికి, నరాలకు ఈ వ్యాధి సోకుతుందన్నారు. బాక్టీరియా శరీరంలోకి ప్రవేశించిన తరువాత వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి 5 నుంచి 7 సంవత్సరాలు పడుతుందని తెలిపారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: మండలంలోని విప్పర్లపల్లి, అలవాల గ్రామాల్లో రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిఏటా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీవరకు 15 రోజుల పాటు లెప్రసిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా కుష్ఠువ్యాధుల వారి పట్ల ప్రేమాభిమానాలు చూపించాలని, కుష్ఠు వ్యాధి లేని సమాజాన్ని నిర్మించాలని తెలిపారు. కుష్ఠు వ్యాధి అనుమానిత కేసులను గుర్తించటానికి గల లక్షణాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో సిహెచ్‌వో చంద్రశేఖర్, ఏఎన్ఎం కవిత, రాము, సురేష్, కిరణ్, తదితర వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

రైతు జనబాంధవుడు సోమేపల్లి

చిలకలూరిపేట: రైతు జనబాంధవుడు సోమేపల్లి సాంబయ్య అని వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ చెప్పారు. దివంగత మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా మండలంలోని తాతపూడి గ్రామం, పట్టణంలోని సాంబశివనగర్, భాస్కర్ సెంటర్‌లోని సోమేపల్లి సాంబయ్య, డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

సోమేపల్లి ఫౌండేషన్ ద్వారా నరసరావుపేటకు చెందిన దివ్యాంగులు, అంధుల హాస్టల్‌కు రూ.30 వేలు విలువ చేసే నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, గేరా లింకన్, చల్లా యజ్ఞేశ్వర రెడ్డి, ఏఎంఎం సుభాని, బీవీ రెడ్డి, సయ్యద్ హిదాయతుల్లా, ఇమ్మడి జానకీపతి, సయ్యద్ జమీర్, షేక్ అహమ్మద్, నిడమానూరు హనుమంతరావు, సాతులూరి కోటి పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మర్రి రాజశేఖర్

కుంగ్‌ఫూ పోటీల్లో గోల్డ్ మెడల్

సత్తాచాటిన గణపవరం విద్యార్థులు

నాదెండ్ల: గణపవరం గ్రామంలోని శ్రీకెల్లంపల్లి భద్రాచలం జెడ్పీహైస్కూల్లో కుంగ్‌ఫూలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు చాంపియన్ షిప్ పోటీల్లో బహుమతులు సాధించారు. ఈనెల 29న కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్‌లో ఉన్న కాకాని వెంకటరత్నం కళ్యాణమండపంలో ఎ అంజిబాబు ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ ఓపెన్ కుంగ్ ఫూ - కరాటే చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 8 మంది కుంగ్ ఫు విద్యార్థులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. వీరిలో ఎస్.చైతన్యరెడ్డి, కె.భవాని, ఎ.అమూల్య గోల్డ్‌మెడల్‌ను కైవసం చేసుకోగా, మరో ఐదుగురు సిల్వర్ మెడల్‌ను సాధించారు. వీరితో పాటు శిక్షణ ఇచ్చిన మాస్టర్ సుభానిని చిలకలూరిపేట గ్రాండ్ మాస్టర్ ఎస్ఎం కమాల్ బాష పాఠశాల పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం అభినందించారు.

సన్మార్గాన్ని బోధించే వారు..

నాదెండ్ల: దైవ ప్రార్థనలు చేస్తూ ప్రతి ఒక్కరికీ సన్మార్గాన్ని బోధించే వారు ధన్యులని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా చెప్పారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని మసీదుల్లో పనిచేసే ఇమామ్, మౌజన్‌లకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సహాయం, నూతన దుస్తుల పంపిణీ చేశారు. ఇమామ్‌లకు రూ.5 వేల చొప్పున, మౌజన్‌లకు రూ.3 వేల చొప్పున రూ.1.12 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, గొంటు శ్రీనివాసరెడ్డి, చల్లా యజ్ఞేశ్వర రెడ్డి, షేక్ కరిముల్లా, కారుచోల విజయభాస్కర్ రెడ్డి, బీవీ రెడ్డి, ఎస్ శ్రీకాంత్, అనస్‌ఖాన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం బాపట్ల జిల్లా పర్చూరు కు చెందిన షేక్ బాజి (46) టైలర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 29వతేదీ ద్విచక్ర వాహనంపై పట్టణంలోని మద్దినగర్‌లో సోదరుడి ఇంటికి వచ్చాడు. సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై ఎన్‌ఆర్‌టీ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన బాజిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. బాధితుడి కుమారుడు ఫిరోజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ సిబ్బంది తీరుపై ఎంపీడీవో అసహనం

శావల్యాపురం: సర్వే పురోగతి సక్రమంగా లేకపోవడంపై ఎంపీడీవో పి.సీతారామయ్య సచివాలయ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. సర్వే ప్రక్రియలో సచివాలయ ఉద్యోగులకు సహకరించని వలంటీర్లు విధుల నుంచి తప్పిస్తామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు గంజినబోయిన వెంకట్రావు, వేల్ఫేర్ సహాయకురాలు సింధుజ , గౌసియాబేగంలపై ఎంపీడీవో అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో ఆలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నవశకం కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సంయుక్తంగా ప్రభు త్వ పథకాలు పొందుతున్న వారిఇళ్లను నేరుగా సందర్శించి వివరాలు సేకరించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్ నమోదు చేయాలని స్పష్టం చేశారు.

11 గ్రామ సచివాలయాల పరిధిలో 12 వేల 929 నివాస గృహాలున్నాయని ప్రతి ఇంటినీ సందర్శించి ప్రభుత్వ పథకాలు అమలు తీరు, నిర్వహణ తదితర వాటిపై సమగ్ర సర్వే చేయాలన్నారు. ఇప్పటి వరకు 3408 నివాస గృహాలను సర్వే చేసినట్లు చెప్పారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల: స్థానిక శ్రీ బాల త్రిపుర సుందరి సమేత శంకరస్వామి ఆలయ 4వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. శ్రీ శంకర స్వామి, బాలత్రిపుర సుందరి అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు ఆలయాన్ని దర్శించి పూజలు నిర్వహించారు. ప్రసాదాలను పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు రొంపిచర్ల శ్రీనివాస శర్మ నిర్వహించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

యడ్లపాడు: క్రీడలు గ్రామాల మధ్య స్నేహసంబంధాలను కల్పిస్తాయని కొత్తపాలెం పంచాయతీ సర్పంచ్ మొలమంటి వెంకట సుబ్బారావు చెప్పారు. పుట్టకోట గ్రామం యూత్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న పది గ్రామాల స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ చెంఘీజ్‌ఖాన్‌పేట, కొండవీడు, కోట, పుట్టకోట, హౌస్‌గణేష్‌పాడు, వేములూరిపాడు, అమీనాబాద్ జట్టుల మధ్య రసవత్తరంగా పోటీలు జరిగాయి. చివరకు కొండవీడు ఫ్రెండ్స్ టీం విన్నర్‌గా, అమీనాబాద్ యూత్ టీం రన్నర్‌గా నిలిచాయి. అనంతరం బహుమతి ప్రదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విజేతలైన జట్లకు సర్పంచ్ ఎంవీ సుబ్బారావు చేతుల మీదుగా ప్రథమ బహుమతి రూ.12,116, ద్వితీయ బహుమతి రూ.8,116 నగదు అందజేశారు.

ఎకో టూరిజంలో దేవాలయాల అభివృద్ధి

అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు నిధులు

బొల్లాపల్లి : ఎకో టూరిజంలో భాగంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మన్నేపల్లి లక్ష్మీనరసింహ స్వామి, సంజీవిని కొండ దేవాలయాలను అభివృద్ధి పరచనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి ఎస్.రామచంద్రరావు తెలిపారు. మంగళవారం మండలంలోని మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆయనతో పాటు ఎంపీపీ బత్తి రాములు హాజరయ్యారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతంలో స్వయంభువుగా వెలసిన శ్రీ మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి విశిష్టత గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మహా శివరాత్రి పర్వదినం రోజున ఈ ఆలయంలో వెంకటేశ్వరస్వామి కళ్యాణం వైభవోపేతంగా నిర్వహిస్తామని స్థానిక పెద్దలు డీఎఫ్‌వోకు వివరించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ ఎకో టూరిజం పనుల్లో భాగంగా ఈ రెండు ఆలయాలను అభివృద్ధి పరచనున్నట్లు తగు ప్రతిపాదనలు పై అధికారులకు పంపామన్నారు. కార్యక్రమంలో వినుకొండ రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్, డీఆర్‌వో ఎం.సురేంద్రబాబు, సెక్షన్ ఆఫీసర్ ఎన్.వి.రమణ, బీట్ ఆఫీసర్స్ సాంబశివరావు, ధనూష్, నాగార్జున, గ్రామపెద్దలు పాల్గొన్నారు.